ప్రజాశక్తి
శుక్రవారం 12 మే 2023
5
అల్లూరి సీతారామరాజు



పర్యావరణ హిత జీవనశైలిపై అవగాహన



ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అటవీ అధికారులు

ప్రజాశక్తి- పెదబయలు : పర్యావరణ హిత జీవనశైలిపై స్థానిక అటవీశాఖ కార్యాలయంలో రేంజర్ ఎం.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అవగాహనా కల్పించారు. పలువురు ప్రజా ప్రతినిధులు, చిన్నారులతో ప్రతిజ్ఞ చేయించారు. సీతాగుంట పంచాయతీ పెదబయలులో మొక్కలు నాటడం, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలోసర్పంచ్ పి మాధవరావు, ఎంపిటిసి కె బొంజుబాబు వైస్ ఎంపిపి కె రాజాబాబు, మాజీ ఎంపిపి వి కొండయ్య, మాజీ ఎంపిటిసి ఎం చంద్రబాబు, వైసిపినేత కొండబాబు, మండల కన్వీనర్ కె కనకరాజు విద్యార్థులు పాల్గొన్నారు

కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం

- కార్యాలయం లోపల బైఠాయించిన గిరిజనులు
- గిరిజన ద్రోహుల్ని గ్రామాల్లో నిలదీయండి
- ఎపి గిరిజన సంఘం నేతల పిలుపు

(ప్రజాశక్తి -పాడేరు)

బోయ/వాల్మీకులు, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చరాదని, జిఒ3ను పునరుద్ధరించి చట్టబద్ధత కల్పించాలని, మన్యంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్, మైనింగ్ అనుమతులు రద్దు చేయాలన్న డిమాండ్లతో అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో గురువారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ ముట్టడి ఆందోళన ఉద్రిక్తంగా సాగింది. గిరిజన సంఘం జిల్లా కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.పెద్దఎత్తున నినాదాలు చేశారు. గిరిజనానికి అన్యాయం చేస్తూ, ప్రభుత్వం బాహాటంగా తీర్మానాలు చేస్తుంటే చోద్యం చూస్తున్న గిరిజన ఎంపీ, ఎమ్మెల్యేలను గ్రామాల్లో నిలదీయాలని గిరిజన సంఘం నేతలు పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించడానికి నాయకులకు అనుమతించకపోవడంతో కలెక్టరేట్ వద్ద కొంతసేపు ఉద్రిక్తత ఏర్పడింది. నాయకులనే కాదు, ఆందోళనకు వచ్చిన గిరిజనులందరినీ కలెక్టరేట్‌లోకి అనుమతించాలని పోలీసులతో ఘర్షణ పడ్డారు. ముందస్తు జాగ్రత్తగా భారీఎత్తున పోలీసులు మొహరించి, ఆందోళనకారులను కలెక్టరేట్ లోపలికి వెళ్లకుండా అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ, గేట్లు తోసుకుంటూ అందరూ లోపలికి చొచ్చుకుపోయారు. అదే సమయంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ జోక్యం చేసుకొని ఆందోళనకారులందరినీ కలెక్టరేట్ లోపలకు రానిచ్చారు. గిరిజనుల సమస్యలను ఆసాంతం విన్న జాయింట్ కలెక్టర్, వారి నుంచి వినతి పత్రాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ,గిరిజనులు, గిరిజన సంఘం నేతలు తమ దృష్టికితెచ్చిన సమస్యలను ప్రభుత్వానికి నివేదించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. బోయ/వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడంలో గిరిజనుల అభ్యంతరాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టులు, మైనింగ్‌లపై సమగ్ర సమాచారాన్ని రప్పించి, వాటిని గిరిజనుల అభ్యంతరం, అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. నిమ్మలపాడు మైనింగ్ లీజ్ రద్దుకు కృషిచేస్తామన్నారు. జిఒ3 రద్దుపై ఉన్న అభ్యంతరాలను ప్రభుత్వానికి వివరిస్తామని హామీనిచ్చారు.



కలెక్టరేట్ లోపల బైఠాయించి ఆందోళన చేస్తున్న గిరిజనులు, నేతలు



చలో కలెక్టరేట్ ఆందోళనలో భాగంగా పాడేరులో నిర్వహించిన ర్యాలీ

గిరిజన ద్రోహులారా ఖబడ్దార్!

ఆదివాసులకు వెన్నుపోటు పొడిచిన ఎంపీ, ఎమ్మెల్యేలు గుణపాఠం తప్పదు..

అటవీ సంరక్షణ చట్టం సవరణపై రాష్ట్రంలోని అధికార, విపక్షాలు స్పందించాలి

హైడ్రో పవర్ ప్రాజెక్ట్, మైనింగ్ లీజు రద్దు చేయాలి : ధర్నాలో గిరిజన సంఘం నేతల డిమాండ్



కలెక్టరేట్‌ను ముట్టడించిన గిరిజనులు



జెసికి సమస్యలను వివరిస్తున్న గిరిజన సంఘం నేత అప్పలనర్స

బోయ/వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్పించే అసెంబ్లీ తీర్మానం రద్దు చేయాలని గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి. అప్పలనర్స డిమాండ్ చేశారు. చలో కలెక్టరేట్ ఆందోళనలో భాగంగా కలెక్టరేట్ గేటు వద్ద గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో అప్పలనర్స మాట్లాడుతూ, తీర్మానం ప్రవేశ పెట్టడానికి ముందు బోయ వాల్మీకుల రిజర్వేషన్లపై వేసిన ఏక సభ్య కమిషన్ ఏనాడు గిరిజన గ్రామాలకు రాలేదని, దీనిపై ఎటువంటి అధ్యయనం చేయకుండానే ప్రభుత్వానికి తప్పుడు నివేదిక ఇచ్చిందన్నారు. దాన్ని ఆధారంగా చేసుకుని, బోయ/వాల్మీకులను ఎస్‌టి బ జాబితల్లో చేర్చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీర్మానించి కేంద్రానికి నివేదించిందన్నారు దీన్ని ఉపసంహరించే వరకు ఉద్యమం ఆగదని హెచ్చరించారు. ఆదివాసులకు అన్యాయం చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తుంటే, గిరిజనుల ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధులు అభ్యంతరం చెప్పకపోగా, సమర్థించడం అన్యాయమన్నారు. ఇటువంటి గిరిజన ద్రోహులు గ్రామాల్లో పర్యటనకు వచ్చినప్పుడు నిలదీయాలని గిరిజనులకు పిలుపునిచ్చారు. జిఒ 3 రద్దుపై సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ పెండింగ్‌లో ఉండగా, అల్లూరు జిల్లా పరిధిలోని రంపచోడవరం ఐటిడిఎలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం కౌన్సిలింగ్ నిర్వహిస్తామని అక్కడి ఐటిడిఎ పిఒ నోటీసు జారీ చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన రివ్యూ పిటిషన్ కోర్టులో పెండింగ్‌లో ఉన్నప్పుడు, గిరిజనులకు ద్రోహం చేస్తూ, ఉద్యోగ ఉపాధ్యాయ రిజర్వేషన్ కల్పించే కుట్రకు అధికారులు పాల్పడడాన్ని గిరిజన సంఘం వ్యతిరేకిస్తుందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో కార్పొరేట్ కంపెనీలకు అమ్ముడు పోయిన గిరిజన ప్రజా ప్రతినిధులపైనా పోరాటం ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం పేరుతో ఆంధ్ర రాష్ట్రంలో గిరిజనుల అధీనంలో ఉన్న 15వేల ఎకరాల అటవీ భూమిని అదానీ, షిర్డిసాయి గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్‌కు అప్పగించాలని వైసిపి ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందన్నారు. అదాని గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్‌కు హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం అప్పగించాలని మోడీ ప్రభుత్వ ఆదేశాల మేరకే కేంద్ర ప్రభుత్వ పర్యావరణ అనుమతి కుడా మంజూరు చేశారన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఆదివాసీలను అడవి నుండి గెంటివేతకు కేంద్ర ప్రభుత్వం 2023 అటవీ సంరక్షణ చట్టం సవరణకు పూనుకోవడంపై ఆవేదన వెలిబుచ్చారు. గిరిజనులు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం సవరిస్తున్న అటవీ సంరక్షణ చట్టం ముసాయిదాపై రాష్ట్రంలో ఉన్న అధికార ప్రతిపక్ష పార్టీలు స్పందించాలని డిమాండ్ చేశారు. దీనిపై గిరిజనులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని విజ్ఞప్తి చేసారు. అల్లూరి సీతారామరాజు పేరుతో గిరిజన జిల్లా ఏర్పాటు చేసిన వైసిపి ప్రభుత్వం గిరిజన హక్కులు, చట్టాలు ఉల్లంఘనలో ముందుండడం సరికాదన్నారు. రాజకీయ లబ్ధి కోసం రాష్ట్ర ప్రజల మధ్య చిచ్చు రేపిన జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంపై ఉద్యమం నిర్వహించాలని ప్రజాతంత్ర వాదులకు, గిరిజనులకు పిలుపు ఇచ్చారు. నిమ్మలపాడు మైనింగ్‌ను గిరిజనులందరూ వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని, చింతపల్లి ప్రాంతంలో గిరిజను నష్టం చేస్తూ సాగిస్తున్న తెల్ల గ్రానైట్ అనుమతి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు పి లక్కు, సిఐటియు జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా రాధాకృష్ణ, గిరిజన సంఘం జిల్లా నాయకులు ఎంఎం శ్రీను, నరసయ్య, రామన్న సత్యనారాయణ, బొజ్జన్న, చిన్నబాబు, నాయుడు. పి బాలదేవ్, రామారావు, బుచ్చిబాబు, కొండలరావు సుబ్బారావు, అధికసంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో అంగన్వాడీలకు
అరకొర పాల సరఫరా

గర్భిణులు, చిన్నారులకు అందని పౌష్టికాహారం

మూడు నెలలుగా ఇదే పరిస్థితి.. పట్టని అధికారులు



అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులు



లిట్టిపుట్లు అంగన్వాడీ కేంద్రం

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అంగన్వాడీ కేంద్రాల్లో ద్వారా పౌష్టికాహారం ఇస్తున్నామని గొప్పగా చెప్పుకొంటున్న వైసిపి ప్రభుత్వం, మూడు నెలలుగా అంగన్వాడీ లబ్ధిదారులైన పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పూర్తిస్థాయిలో పాలు సక్రమంగా సరఫరా చేయలేక పోతోంది. అరకులోయ మండల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలకు రెండు మూడు నెలలుగా ఇదే పరిస్థితి. మండలంలోని మొత్తం 164 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. మార్చి నెలలో ఏ ఒక్క అంగన్వాడీ కేంద్రానికీ పూర్తిగా పాలు సరఫరా చేయలేదు. ఏప్రిల్ నెలలో 38 అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా కాలేదు .ప్రతి నెలా మొదటి వారమే అంగన్వాడీ కేంద్రాలకు పాలు అందాల్సి ఉండగా,. మే నెలలో ఇప్పటివరకు పత్తా లేదు. ఈ నెల కూడా పాలు వస్తాయో లేదోనని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఎదురుచూస్తున్నారు.అంగన్వాడీ కేంద్రాల ద్వారా సక్రమంగా పాలు సరఫరా లేకపోతే, గిరిజనానికి పౌష్ఠికాహారం అందించినట్లు ఎలా అవుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు చెబుతున్నదానికీ, వాస్తవంగా క్షేత్రస్థాయిలో జరుగుతున్న దానికి ఎక్కడా పొంతన కనిపించడం లేదని పలువురు అంటున్నారు..గిరిజన ప్రాంతంలో పౌష్టికాహారం లోపం, రక్తహీనతతో అనేక మంది ఇబ్బందులు పడుతున్నారు. గర్భిణులు, బాలింతలు,చిన్నారులకు ప్రతి నెలా ఐసిడిఎస్ ద్వారా అందించే పౌష్టికాహారం, పాలు వల్ల వారి ఆరోగ్యం ఎంతో కొంత కుదుటుగా ఉండేదని, ఇపుడు అదికాస్తా అటకెక్కించడంతో ఐసిడిఎస్ లక్ష్యం ఏమైనట్టని పలువురు అంటున్నారు. మూడు నెలలుగా, అదీ వేసవి కాలంలో పాలు సరఫరా చేయకపోతే, గిరిజన చిన్నారుల ఆరోగ్యం పరిస్థితి ఏమిటని తల్లిదండ్రులు బాలింతలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి అంగన్వాడీ కేంద్రాలకు పాలు సరఫరా చేసి, తద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించే చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. దీనిపై ఐసిడిఎస్ అధికారుల వివరణ కోరగా, మార్చి, ఏప్రిల్ నెలలో అరకొరగా పాలసరఫరా నిజమేనని, అయితే ఈ సమస్య రాష్ట్రవ్యాప్తంగా ఉందని అంటున్నారు. పైనుంచి తమకు పాల సరఫరా నిలిచిపోతే, తామేం చేయగలని చేతులెత్తేస్తున్నారు.

వరి విత్తనాలకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని రైతులు వరి విత్తనాల కోసం ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి రమేష్ నాయుడు తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలానికి 1200 క్వింటాళ్ల వరి విత్తనాలు రైతులకు అవసరమని గుర్తించి ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు చెప్పారు. ఎంటియు 1064-1012.9, ఎంటియు 1121-1247, ఎంటియు1318 రకం విత్తనాలు 34,445 క్వింటాళ్లకు ప్రతిపాదనలు పంపడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం 400 క్వింటాళ్ల ఎంటియు1064 వరివిత్తనాలు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. విత్తన మొలక శాతం పరిశీలించిన తర్వాత పంపిణీ చేస్తామన్నారు. ఎంటియు 1064 30 కేజీల బస్తా ధర రూ.1143, ఒక కేజీ రూ.38.10 అని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



పరీక్ష ఫీజుకు డబ్బులు అందజేస్తున్న పాత్రికేయుడు నాగార్జున

అనాథ విద్యార్థికి పరీక్ష ఫీజు చెల్లింపు

ప్రజాశక్తి -ఎటపాక

మండలంలోని గౌరీదేవి పేట గ్రామానికి చెందిన తల్లిదండ్రులు లేని అనాథ విద్యార్థికి 10వ తరగతి పరీక్ష ఫీజును అదే గ్రామానికి చెందిన పాత్రికేయుడు బుడిపిటి నాగార్జున చెల్లించి దాతృత్వం చాటారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పదవ తరగతి ఫలితాల్లో సదరు విద్యార్థి ఒక సబ్జెక్టులో ఫెయిల్ అయింది. దీంతో పరీక్ష ఫీజు కట్టేందుకు డబ్బులు లేకపోవడంతో నిరాశకు గురైంది. సహకరించేవాళ్లు ఆదరించేవారు ఎవరూ లేకపోవడంతో పరిస్థితిని తెలుసుకున్న పాత్రికేయుడు నాగార్జున గురువారం గౌరీ దేవిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సదరు విద్యార్థికి పరీక్ష రుసుము చెల్లించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ విద్యార్థిని తల్లిదండ్రులు అనారోగ్యంతో మరణించారని, దీంతో వారి ముగ్గురు పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

13న ఉమ్మడి విశాఖ జిల్లా సర్పంచ్‌ల సదస్సు

ప్రజాశక్తి-పరవాడ : సర్పంచుల సమస్యల సాధనకై ఉమ్మడి విశాఖ జిల్లా సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 13న శనివారం సర్పంచ్‌ల సదస్సు నిర్వహిస్తున్నట్లు సంఘం ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షులు చింతకాయల సుజాత ముత్యాలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి గాంధీ మార్కెట్, కన్యకాపరమేశ్వరి దేవాలయం దగ్గర ఉన్న వైఎంవిఎ కమ్యూనిటీ హాల్‌లో శనివారం ఉదయం 10 గంటలకు జరుగు ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు వైవిబి.రాజేంద్రప్రసాద్, ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం అధ్యక్షులు వానపల్లి లక్ష్మి ముత్యాలరావు హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. జిల్లాలోని సర్పంచులు పడుతున్న ఇబ్బందులపైనా, రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీల నిధులను విద్యుత్ బకాయిల పేరుతో మళ్లించడంపైనా, వాలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల పేరుతో సర్పంచుల అధికారాలు, విధులు, బాధ్యతలు హైజాక్ చేసి వారిని ఉత్సవ విగ్రహాలుగా మార్చి పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేయడంపైనా, వివిధ సమస్యలపైనా చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ సదస్సుకు ఉమ్మడి విశాఖ జిల్లాలోని అన్ని పార్టీలకు చెందిన సర్పంచ్‌లు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఈదురుగాలులతో భారీ వర్షం

- నేల కొరిగిన వృక్షాలు - పలు చోట్ల విద్యుత్ అంతరాయం



అడ్డతీగల- వై.రామవరం రహదారికి అడ్డంగా కూలిన చెట్టు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి, అడ్డతీగల

రాజవొమ్మంగి, వై.రామవరం, అడ్డతీగల తదితర ప్రాంతాల్లో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురుగాలుల కారణంగా ఈ మూడు మండలాల్లో పలుచోట్ల వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అడ్డతీగల-వై.రామవరం వెళ్లే రహదారి మధ్యలో భారీ వృక్షం నేలకొరకడంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానికులు పోలీస్ సిబ్బంది చొరవతో గ్రామస్తులు రెండు గంటల పాటు శ్రమించి చెట్టు కొమ్మలను తొలగించడంతో వాహనాల రాకపోకలు యథావిధంగా సాగాయి. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు విపరీతమైన వడగాలప్పులతో కూడిన ఎండ కాయడంతో మన్యం వాసులు ఉక్కపోతతో అల్లాడిపోయారు. మధ్యాహ్నం తరువాత ఆకాశంలో ఒక్కసారిగా నల్ల మబ్బులు కమ్ముకొని ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ఉక్కపోతతో అల్లాడుతున్న మన్యం వాసులు సేదతీరారు.

పిడుగుపాటుకు 3 ఆవుల మృతి

ఎటపాక : మండలంలోని పట్టుచీర గ్రామంలో గురువారం సాయంత్రం పిడుగుపడి 3 ఆవులు మృతి చెందాయి. ఆ గ్రామానికి చెందిన తెల్లం రంగారావుకు చెందిన ఒక ఆవు, ఇర్పా ముత్తయ్యకు చెందిన 2 ఆవులు మృత్యువాత పడ్డాయి. వ్యవసాయానికి ఆసరాగా ఉండే ఆవులు మృతి చెందటంతో రైతులు బాధలో మునిగిపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.



సంఘటనా స్థలంలో ఆవుల మృతదేహాలు

ఎరియర్స్ చెల్లించాలని జిసిసి హమాలీల ధర్నా

ప్రజాశక్తి - చింతూరు

2022 జనవరి నుండి ఇప్పటి వరకు జీసీసీ హమాలీలకు రావాల్సిన ఎరియర్స్ తక్షణమే చెల్లించాలని, జిఒఆర్‌టి నెంబర్-3ను తక్షణమే అమలు చేయాలని కోరుతూ చింతూరు జీసీసీ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో హమాలీలు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిసిసి హమాలీలకు ఏడాదికి పైగా ఎరియర్స్ చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. గతేడాది వరదలు సమయంలో కష్టపడి పని చేసినందుకు జీసీసీ హమాలీలకు ఇవ్వాల్సిన డబ్బులు ఇంకా చెల్లించలేదని, మరో నెలలో మళ్లీ వరదలు వచ్చే సమయం రానుందని, అయినా ఇంత వరకు ఇవ్వకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు చింతూరు మండల కార్యదర్శి పోడియం లక్ష్మణ్, జిసిసి హమాలీలు స్వామి, చిచ్చుడి నాగు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న జిసిసి హమాలీలు



లీకేజీ నీరు వెళ్లకుండా చేపడుతున్న పనులను పరిశీలిస్తున్న సిఇ శ్రీధర్ తదితరులు

జోరుగా నాలుగో యూనిట్ మరమ్మతు పనులు

- ఎపి జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజినీర్ శ్రీధర్

ప్రజాశక్తి -సీలేరు

సీలేరు జల విద్యుత్ కేంద్రంలో నాలుగో యూనిట్ మరమ్మతు పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజినీర్ బి.శ్రీధర్ వెల్లడించారు. గురువారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ నాలుగో యూనిట్ మరమ్మతు పనులను అబిరామ ఇంజనీరింగ్ కంపెనీకి కాంట్రాక్ట్ ప్రాతిపదికన అప్పగించామని తెలిపారు. నాలుగో యూనిట్ పూర్తిస్థాయిలో ఓపెన్ చేసి పరిశీలించగా యూనిట్లో ట్రస్ట్ బేరింగ్ ప్యాడ్స్, జనరేటర్ గైడ్ బేరింగ్ ప్యాడ్స్ మరమ్మతులు గురయ్యాయని గుర్తించామని చెప్పారు. పాత వాటిని మరమ్మతులు చేస్తే ఉపయోగపడతాయా లేదా అనే విషయాన్ని నిర్ధారించి ఉపయోగపడన పక్షంలో వాటి స్థానంలో కొత్త ట్రస్ట్ బేరింగ్ ప్యాడ్సను అమర్చడానికి చర్యలు చేపడతామని వెల్లడించారు. యూనిట్ మరమ్మతులకు రూ.22 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేసినట్లు తెలిపారు. స్థానిక జల విద్యుత్ కేంద్రంలో మూడు యూనిట్ల నుంచి విద్యుత్ ఉత్పత్తి కొనసాగిస్తున్నామన్నారు. డొంకరాయి రిజర్వాయర్లో నీటి నిల్వలు తక్కువగా ఉండడంతో అక్కడ జల విద్యుత్ కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తి నిలిపివేశామని చెప్పారు. పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో నాలుగు యూనిట్లు ద్వారా గ్రిడ్ ఆదేశాల మేరకు విద్యుత్ ఉత్పత్తి నిరాటకంగా కొనసాగుతుందని వెల్లడించారు.

డ్రాఫ్ట్ చూబ్ గేట్లు లీకేజీ నీరు వెళ్లకుండా చర్యలు

డ్రాఫ్ట్ చూబ్ గేట్లు ద్వారా లీకేజీ నీరు నాలుగో యూనిట్‌లోకి వెళ్ళకుండా నియంత్రించడానికి ఏపీ జెన్కో చీఫ్ ఇంజనీర్ బి.శ్రీధర్, ఈఈ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో గురువారం పనులు చేపట్టారు. నాలుగో యూనిట్ మరమ్మతులు చేపట్టాలంటే యూనిట్‌లోకి నీరు రాకుండా నియంత్రించవలసి ఉంది. ఇందులో భాగంగానే డ్రాఫ్ట్ చూబ్ గేట్లు ద్వారా లీకేజీ నీటిని అరికట్టే విధంగా అండర్ వాటర్ సర్వీస్ జాన్ పనులు అప్పగించారు. చీఫ్ ఇంజనీర్ శ్రీధర్ సూచన మేరకు డ్రాఫ్ట్ చూబ్ గేట్లు కిందికి దింపడానికి జెన్కో ఇంజనీర్లు, కార్మికులు చర్యలు చేపట్టారు. దీంతో నాలుగో యూనిట్‌లోకి లీకేజీ నీరు వెళ్లకుండా నియంత్రించగలిగారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

నేషనల్ హైవే 516ఇ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ స్తంభాలు, లైన్ల మార్పు చేయడం జరుగుతున్న నేపథ్యంలో గంగవరం, అడ్డతీగల, వై.రామవరం, రాజవొమ్మంగి మండలాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎపి ట్రాన్స్‌కో ఈఈ ఎండి.యూసఫ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.



పట్టుబడిన గంజాయితో పోలీసులు

230 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి -పెదబయలు రూరల్ : మండలంలోని రూడకోట జంక్షన్ వద్ద ఎస్ఐ పి.మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎపిఎస్‌పి పోలీసులతో కలిసి స్థానిక పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో 230 కిలోల గంజాయి పట్టుబడింది. ముందస్తుగా అందిన పక్కా సమాచారం మేరకు తనిఖీలు చేయగా, జామిగూడ, కుమడ వైపు నుంచి ఎపి39 టిటి2330 నెంబరు గల ఆటో వస్తుండగా, అనుమానంతో పోలీస్ సిబ్బంది వాహనాన్ని తనిఖీ చేయగా, ఆటోలో ఉన్న ఇద్దరు వ్యక్తులు పారిపోయేందుకు ప్రయత్నించారు. వెంబడించి వారిని పట్టుకున్న పోలీసులు, తర్వాత ఆటో తనిఖీ చేయగా 230 కిలోల గంజాయి పట్టుబడింది. ఒడిశా సరిహద్దు జెబ్బూరు నుండి కొనుగోలు చేసి విశాఖపట్నం గంజాయిని తీసుకెళుతున్నట్లు నిందితులు అంగీకరించారు. ఈ మేరకు జి.మాడుగుల మండలం, పికె.పల్లి పంచాయతీ కొత్తఊరుకు చెందిన కొర్ర ప్రసాద్, గన్నేరుపుట్టు గ్రామానికి చెందిన సూరిబాబులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు.

ఐటి ప్రగతిలో నాస్కామ్ కీలక పాత్ర

ప్రజాశక్తి-మధురవాడ : గడిచిన 30 సంవత్సరాలలో దేశంలోని ఐటి రంగాన్ని ఏకతాటిపైకి తీసుకొచ్చి ప్రగతి పథంలో నడిపించడంలో నాస్కామ్ (నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్) కీలక పాత్ర పోషించిందని, ముఖ్యంగా ప్రభుత్వానికి, ఐటి రంగానికి మధ్య విధాన నిర్ణయాలు తీసుకోవడంలో వారధిగా నిలిచిందని నాస్కామ్ సహ వ్యవస్థాపకుడు హరీష్ మెహతా పేర్కొన్నారు. నేషనల్ టెక్నాలజీ డే సందర్భంగా గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐటి రంగం ప్రగతిని ముందుగానే ఊహించిన ఘనత అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. దేశంలోని 20 రాష్ట్రాలకు ఐటి డ్రాఫ్ట్ పాలసీలను నాస్కామ్ రూపొందించిందని, ఐటి రంగం ప్రయోజనాలపై దశాబ్దాల కిందటే ప్రభుత్వాలకు నాస్కామ్ వివరించిందని తెలిపారు. నాస్కామ్ తరహాలో చైనా సహా ఇతర దేశాలు ప్రత్యేక వ్యవస్థలను రూపొందించుకునే ప్రయత్నం చేసినా అంతగా విజయం సాధించలేకపోయారు. నేడు భారతదేశం ప్రపంచం దృష్టిలో ప్రతిభ గల మానవ వనరుల కేంద్రంగా తన ముద్రను కొనసాగిస్తోందని తెలిపారు. ఇతర దేశాల ఆర్థిక సంక్షోభ ప్రభావం భారత ఐటి రంగంపై పెద్దగా ఉండబోదని, కృత్రిమ మేధ వంటి నూతన టెక్నాలజీలపై దేశ మానవ వనరులను సిద్ధం చేసుకోవాలని సూచించారు. దేశంలో స్టార్టప్ సంస్కృతి పెరుగుతోందని, ఇది మరింతగా వృద్ధి చెందాలంటే స్వయం నియంత్రణ వ్యవస్థను అభివృద్ధి చేసుకోవాలని, దీనిపై ఇప్పటికే నాస్కామ్ కార్పొరేట్ గవర్నెన్స్ నిబంధనలను రూపొందించిందని వెల్లడించారు. ఛాట్ జిపిటి వంటివి భారత దేశంలో విప్లవాత్మక మార్పులకు దారితీయగలవని అన్నారు. అనంతరం హరీష్ మెహతాను గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానందసిద్దవట్టం సన్మానించారు. కార్యక్రమంలో గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, రెస్కెర్ల విభాగం డైరెక్టర్ డాక్టర్ రాజాపణిపప్పు తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై గీతం విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి-మధురవాడ : రహదారి భద్రతపై యువతలో విద్యార్థులలో అవగాహన కల్పించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్, జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) వాలంటీర్ల ఆధ్వర్యాన గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గీతం మేనేజ్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ అమిత్‌భద్ర మాట్లాడుతూ రహదారి ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోతున్న వారిలో యువత అధికంగా ఉంటున్నారని, దానికి కారణం మితిమీరిన వేగమేనని పేర్కొన్నారు. రహదారి నిబంధనలు పాటించడంతో పాటు హెల్మెట్ ధారణ, ప్రయాణంలో సెల్‌ఫోన్ దూరంగా ఉంచడం వంటివి ప్రమాదాలను నివారిస్తాయని పేర్కొన్నారు.

నిరుపయోగంగా రైతుబజార్!

40 దుకాణాలున్నా ప్రయోజనం శూన్యం
కొన్నేళ్లుగా వినియోగంలో లేక అధ్వానం
పశువులు, మందుబాబులకు అడ్డా మారిన వైనం



ప్రజాశక్తి-పాడేరు టౌన్: ***అల్లూరి జిల్లా కేంద్రం, పాడేరు నడిబొడ్డున ఉన్న ఎన్టీఆర్ రైతుబజార్ నిరుపయోగంగా ఉంది. పాలకులు మార్కెటింగ్ శాఖ నిర్లక్ష్యంతో ఇందులో 40 దుకాణాలు ఉన్నా వినియోగంలో లేకుండాపోయాయి. ఫలితంగా పశువులకు నిలయంగా, మందుబాబులకు అడ్డాగా మారింది. ఈ రైతుబజార్‌ను వినియోగంలోకి తీసుకురావాలన్న డిమాండ్ సర్వత్రా వినిపిస్తోంది.***

పాడేరు పట్టణంలోని పాత బస్‌స్టాండ్ అంబేద్కర్ కూడలి వద్ద ఉన్న సుమారు అర ఎకరం స్థలం ఆక్రమణలకు గురికాకూడదనే ఉద్దేశంతోపాటు సంత రోజుల్లో దుకాణాలు వేసుకునేందుకు అనువుగా 2003లో రూ.5 లక్షల వ్యయంతో ఎన్టీఆర్ రైతు బజారును నిర్మించారు. అప్పట్లో శుక్రవారం వారపుసంత రోజున రైతులు, వర్తకులు దానిని వినియోగించారు. దుకాణాలు పెట్టడం వల్ల వినియోగదారులు రాక, తమకు బేరాలు ఉండటం లేదని రైతులు, వర్తకులు రైతు బజార్ ను వినియోగించేందుకు ఆసక్తి చూపలేదు. దీంతో రైతుబజార్ వినియోగానికి దూరమైంది. అప్పటినుంచి పాలకులు అధికారులు రైతుబజార్ వైపు కన్నెత్తి చూడలేదు. దీంతో పశువులకు నిలయంగా, మందుబాబులకు అడ్డాగా తయారైంది. 2014లో టిడిపి అధికారంలో వచ్చిన ఏడాది తరువాత మార్కెట్ కమిటీలను నియమించింది. 2015లో అప్పటి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బొర్రా విజయరాణి రైతుబజారు వినియోగంలోకి తీసుకురావాలని సంకల్పించారు. అప్పటి ఐటిడిఎ పిఒ హరినారాయణన్, సబ్ కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ సహకారంతో రైతుబజారు వినియోగంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేశారు. అప్పటి ఐటిడిఎ పిఒ హరినారాయణన్ రూ.5 లక్షలు విడుదల చేశారు. ఆ నిధులతో 40 దుకాణాలకు పైకప్పు రేకులు వేసినప్పటికీ వినియోగంలోకి రాలేదు. ఆ తరువాత టిడిపి, వైసిపి ప్రభుత్వాలు కూడా రైతు బజారు వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. దీంతో రైతు నిరుపయోగంగా మారింది.

మార్కెటింగ్ శాఖ నిర్లక్ష్యం..

రైతుబజారు బాగోగులు చూడాల్సిన మార్కెటింగ్ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని పలువురు ఆరోపిస్తున్నారు. రైతు బజార్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ఎవరు కృషి చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరుపయోగంగా, అధ్వానంగా, మందుబాబులకు నిలయంగా మారిన రైతు బజార్‌ను వినియోగంలోకి తీసుకు రాలేకపోవడం విమర్శలకు తావిస్తున్నది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు రైతు బజారును వినియోగంలోకి తీసుకురావాలని రైతులు, వర్తకులు కోరుతున్నారు.



గుట్టలుగా పోసి ఉన్న మందు బాబుల సీసాలు

ఏజెన్సీలో పర్యాటకాభివృద్ధికి ప్రత్యేక కృషి

అల్లూరి జిల్లా డిఎఫ్ఒ వినోద్‌కుమార్

ప్రజాశక్తి -అనంతగిరి : అల్లూరి జిల్లా మన్యంలోని అటవీ ప్రాంతాలను ఎకో టూరిజం ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు అల్లూరి జిల్లా డిఎఫ్ఒ వినోద్‌కుమార్ అన్నారు. గురువారం ప్రపంచ అటవీ హక్కుల దినోత్సవం సందర్భంగా ఏజెన్సీకి ముఖద్వారమైన అనంతగిరి మండలం చిలకలగెడ్డ గ్రామంలో అటవీ సిబ్బంది, ఇతర సామాన్య వ్యక్తులతో సుమారు రెండు కిలోమీటర్లు దూరం కొండల మధ్య ట్రెక్కింగ్ నిర్వహించారు. అటవీ సంపద, వాటి సంరక్షణ, విలువలపై అందరికీ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ, మైదాన ప్రాంతంతోపాటు ఇతరత్రా ప్రదేశాల నుంచి ఏజెన్సీ ప్రాంత సందర్శనకు వచ్చే పర్యాటకుల సౌకర్యార్థం చిలకలగెడ్డ చెక్‌పోస్టు వద్ద సందర్శకులు అలసటను తీర్చి,సేదదీరేందుకు వీలుగా పార్కులను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. అక్కడ పిల్లలు ఆడుకునేందుకు అవసరమైన సౌకర్యాలతోపాటు పెద్దలకు ఉపశమనానికి సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామన్నారు. చిలకలగెడ్డ చెక్ పోస్ట్‌కు ఆనుకొని ఉన్న ఎత్తైన కొండశిఖరంలో ట్రెక్కింగ్ నిర్వహించేందుకు సాధ్యాసాధ్యాలపై పరిశీలించనున్నట్లు వెల్లడించారు. ట్రెక్కింగ్ వల్ల కలిగే ఆరోగ్య, ఇతరత్రా ప్రయోజనాలను ఈ సందర్భంగా వివరించారు.

అంతేకాకుండా ఎగువశోభ పంచాయతీ కాఫీ తోటలు, చాపరాయి వద్ద సీతాకోక చిలుకల పార్క్ నిర్మించేందుకు ప్రణాళికలు ఇప్పటికే సిద్ధం చేశామని, త్వరలో పనులను ప్రారంభించేందుకు శ్రీకారం చుడుతామన్నారు. జిల్లా పరిధిలో అన్ని మండలాల్లో ఫారెస్టు శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో రేంజర్ దుర్గాప్రసాద్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు ఎన్ సీతారాం, సిబ్బంది పాల్గొన్నారు



చిలకలగెడ్డ వద్ద ట్రెక్కింగ్‌లో డిఎఫ్ఒ వినోద్‌కుమార్

నేరాలు ఘోరాలు

గృహిణి దుర్మరణం

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక లంకా గ్రౌండ్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గృహిణి దుర్మరణం చెందారు. చోడవరం ప్రాంతానికి చెందిన కె.అమ్మాజీ (35) భర్తతో కలిసి పనిమీద షీలానగర్ వస్తున్నారు. ద్విచక్ర వాహనంపై వస్తున్న వీరిని గాజువాక లంకా గ్రౌండ్ ఎదురుగా జాతీయ రహదారిలో లారీ ఢీకొట్టింది. దీంతో ఆమె కింద పడి దుర్మరణం చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం

ప్రజాశక్తి-పెందుర్తి : యువతి అదృశ్యంపై పెందుర్తి పోలీసు స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. దీనికి సంబంధించి పెందుర్తి సిఐ అప్పారావు కథనం ప్రకారం... నడుపూరు అప్పారావు కుటుంబంతో కలిసి పెందుర్తిలో నివాసముంటున్నారు. ఎమ్మెస్సీ చదివిన వీరి కుమార్తె శైలజ (23) గురువారం ఉదయం 11 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లారు. సాయంత్రానికి కూడా ఇంటికి రాకపోవడంతో తండ్రి పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కోటవురట్ల: అక్సాహెబ్ పేట గ్రామానికి సంబంధించి కూర్మాసల నూకరాజు (73) అనే వ్యక్తి ఈనెల 10వ తేదీ నుంచి కనిపించడం లేదని ఆయన బంధువులు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ నారాయణరావు తెలిపారు. నూకరాజు తప్పిపోయిన సమయంలో తెల్లలుంగీ, తెల్ల షర్టు, మెడలో తువ్వాలుతో ఉన్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94409 04213 మొబైల్ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

గాయపడిన బాలుడు మృతి

- ప్రమాదస్థలిని పరిశీలించిన డిఎస్‌పి ప్రవీణ్‌కుమార్

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లి జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బాలుడు సుధీర్ లాజర్ మృతి చెందినట్లు ఎస్ఐ శిరీష తెలిపారు. నక్కపల్లి నుండి పెదపూడి కిరణ్ భార్య భారతి, పిల్లలు సుధీర్ లాజర్, శ్రుతిలతో బైక్‌పై సారిపల్లివానిపాలెం వెళుతుండగా నక్కపల్లి జాతీయ రహదారిపై ఇసుక ర్యాంపు సమీపంలో ఆటోను వ్యాన్ ఢీకొట్టడంతో, ఆ ఆటో ముందున్న బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న వారితోపాటు, బైక్‌పై ప్రయాణిస్తున్న పలువురు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో బైక్ ఉన్న కిరణ్ కుమారుడు సుధీర్ లాజర్ తీవ్రంగా గాయపడటంతో, విషమస్థితిలో ఉన్న బాలుడిని హుటాహుటిన విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో బుధవారం అర్ధరాత్రి బాలుడు సుధీర్ లాజర్ మృతి చెందినట్లు ఎస్ఐ శిరీష గురువారం వెల్లడించారు .

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు : డిఎస్‌పి

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు డిఎస్‌పి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం నక్కపల్లిలోని రోడ్డు ప్రమాదస్థలిని ఎస్ఐ శిరీషతో కలిసి పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందో అడిగి తెలుసుకున్నారు. రాంగ్‌రూట్‌లో వాహన రాకపోకలు సాగించకుండా అన్ని విధాల చర్యలు చేపట్టాలని ఎస్ఐ శిరీషకు ఆదేశించారు. వాహనాల వేగనియంత్రణపై దృష్టి సారించాలని సూచించారు.

బైకిస్ట్‌కు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-నక్కపల్లి : మండలంలోని బోయపాడు గ్రామానికి చెందిన మఠం చిన్న గురువారం బైక్‌పై బయలుదేరి వెళుతుండగా అమలాపురం సమీపంలో బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చిన్నాను స్థానికులు స్థానిక సిహెచ్‌సికి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వైద్యుల సూచనల మేరకు అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రికి తరలించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- చోడవరం : చోడవరం పంచాయతీ గ్రామానికి చెందిన పొట్నూరి హరి (39) అనే వ్యక్తి గురువారం రేవళ్లు వెళ్లే మార్గ మధ్యలో ఉన్న మామిడి తోటలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హరి గతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి ఆర్థికంగా నష్టపోవడంతో అప్పులు భారం అధికమై ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. హరి మృతితో పెళ్లీడుకొచ్చిన ఇద్దరు ఆడపిల్లలు, కుటుంబం వీధిన పడినట్లు అయింది. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



పురస్కారం అందుకుంటున్న పోర్టు ఛైర్మన్ అంగముత్తు

వైజాగ్ పోర్టుకు సాగర్ శ్రేష్ట సమ్మాన్ పురస్కారం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

మేజర్ పోర్టులలో వివిధ రకాల నిర్వహణా సూచీలలో అసాధారణమైన పనితీరు కనబరిచినందుకు ఏటా ఇచ్చే సాగర్ శ్రేష్ట సమ్మాన్ పురస్కారం విశాఖపట్నం పోర్టు అథారిటీకి లభించింది. న్యూఢిల్లీలో జరిగిన హరిత్ సాగర్ కార్యక్రమం ప్రారంభోత్సవం సందర్భంగా కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలరవాణా శాఖ మంత్రి శర్బానంద్ సోనోవాల్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని విశాఖపట్నం పోర్టు ఛైర్మన్ మధేయాన్ అంగముత్తు స్వీకరించారు. ఇదే కార్యక్రమంలో జీరో కార్బన్ ఎమిషన్ గోల్ సాధించేందుకు పాటించాల్సిన మార్గదర్శకాలను కేంద్ర మంత్రి విడుదల చేశారు. కార్యక్రమంలో పోర్టు సహాయ మంత్రి శ్రీపాద వై నాయక్, షిప్పింగ్ సెక్రటరీ సుధాన్ష పంత్ పాల్గొన్నారు.

మహిళ న్యాయ పోరాటం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వస్త్ర వ్యాపారం కోసం ఒప్పందం చేసుకుని ఇప్పుడు వేధింపులకు పాల్పడుతున్నారంటూ ఓ మహిళ గురువారం న్యాయపోరాటానికి దిగింది. ఆమె కథనం ప్రకారం.. విజయనగరానికి చెందిన లెంక లీలా భారతి విశాఖ నగరం ఆశీలుమెట్ట వద్ద ఉన్న శ్రీవాణి వస్త్ర దుకాణం యజమాని బలబద్ర వెంకట కుమార్‌తో ఈ ఏడాది మార్చి 23న ఒప్పందం చేసుకుంది. తాను ఫ్యాషన్ డిజైనర్‌గా రూపొందించిన వస్త్రాలు అమ్ముకునేందుకు అనుమతినిస్తూ ఒప్పందం కుదిరింది. అప్పటికి తనకు జిఎస్‌టి అనుమతి లేనందున శ్రీవాణి వస్త్ర దుకాణం కుమార్‌తో వ్యాపార ఒప్పందం కుదుర్చుకున్నట్లు బాధితురాలు తెలిపారు. ఏప్రిల్ 10న వ్యాపార నిమిత్తం అహ్మదాబాద్, సూరత్ ప్రాంతాలకు వెళ్లగా ఆ సమయంలో కొంత వ్యాపారం జరిగిందని, దీనికి సంబంధించి 40 వేల రూపాయలను ఆయన తనకు బ్యాంకు ద్వారా పంపించారని చెప్పారు. ఒప్పందంలో పేర్కొన్న ప్రకారం 20 శాతం మాత్రమే ఆయన తీసుకోవాలని, కానీ ఒప్పందాన్ని అతిక్రమిస్తూ 32 శాతం తీసుకున్నారని, దీనిని ప్రశ్నించినందుకు తనపై వేధింపులు ప్రారంభించారని ఆమె వాపోయారు.

ఒప్పందం చెల్లదని, ఇక్కడ తన వ్యాపారం చేయడానికి అనుమతి లేదని, అక్కడి నుంచి వెళ్లిపోవాలని బెదిరిస్తున్నారని ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. తనపై వేధింపులలో భాగంగా ఏప్రిల్ 19న షాపులో ఉంచిన 18 లక్షల అమ్మకపు విలువగల సరుకును దొంగిలించారని ఆరోపించారు. దీనిపై త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. ఈ క్రమంలోనే ఈ నెల 9న సుమారు 15 లక్షల విలువైన సరుకులను మరొకసారి దొంగిలించారన్నారు. అంతేకాకుండా తనను షాపులో వ్యాపారం చేయనీకుండా బలవంతంగా బయటకు పంపేందుకు కుమార్ ప్రయత్నిస్తున్నాడని, అతని నుంచి తనకు ప్రాణహాని ఉందని, దీనిపై పోలీసులు వెంటనే విచారణ చేపట్టి, తనకు న్యాయం చేయాలని ఆమె కోరారు.

రైతు దినోత్సవాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 14న ప్రపంచ రైతుల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జెవి.రత్నం పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఉదయం ఉమెన్స్ కాలేజీలోని ఉద్యాన వనాల శాఖ ఇంటర్న్‌షిప్ విద్యార్థులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆ రోజు ప్రపంచ వ్యాప్తంగా విభిన్న కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. రైతును ఆదుకోవాలని కోరారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పుష్పలత మాట్లాడుతూ ప్రకృతి ఆధారంగా పంటలు పండించుకుందామని, ఆరోగ్యవంతంగా జీవిద్దామని పిలుపునిచ్చారు.

ప్రారంభోత్సవాల హడావుడి


విశాఖలో బిజీబిజీగా గడిపిన సిఎం జగన్
వైఎస్ఆర్ విగ్రహం, అపోలో కేన్సర్ సెంటర్, సీ హారియర్ మ్యూజియం,
ఇండోర్ స్పోర్ట్స్ స్టేడియం ప్రారంభం - క్రీడాకారులతో మాటామంతీ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ

విశాఖలో గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన బిజీబిజీగా సాగింది. వరుస ప్రారంభోత్సవాలతో సందడిగా ముగిసింది. ఆయన మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రత్యేక విమానంలో విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. తొలుత పిఎం.పాలెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఎసిఎ - విడిసిఎ క్రికెట్ స్టేడియం ముందు ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం క్రికెట్ అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులతో సమావేశమయ్యారు. అందరినీ ఆత్మీయంగా పలకరించారు. క్రీడాకారిణి కె.అంజలి శర్వాణికి రూ.10 లక్షల నగదు బహుమతి అందజేశారు. ప్రతిభకు ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందని వెల్లడించారు. ఆ తర్వాత ఆరిలోవ హెల్త్‌సిటీలోని అపోలోలో నూతనంగా నిర్మించిన కేన్సర్ యూనిట్‌ను ప్రారంభించారు. వైద్యాధికారులతో ప్రత్యేకంగా మాట్లాడారు. అనంతరం విశాఖపట్నం పర్యాటక అభివృద్ధిలో భాగంగా పది కోట్ల రూపాయల వ్యయంతో విఎంఆర్‌డిఎ ఆర్‌కె.బీచ్ వద్ద నిర్మించిన సీ హారియర్ టూరిజం ప్రాజెక్టును ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన యుద్ధ విమానం, ఇతర ప్రదర్శన అంశాలను పరిశీలించారు. విమానం, నమూనాల గురించిన విశేషాలను నౌకాదళ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

ఆ తరువాత ఎంవిపి.కాలనీలో 1.18 ఎకరాల విస్తీర్ణంలో రూ.25.50 కోట్లతో జివిఎంసి నిర్మించిన ఇండోర్ స్పోర్ట్స్ స్టేడియాన్ని, రామ్ నగర్‌లో రూ.13.50 కోట్లుతో విఎంఆర్‌డిఎ నిర్మించిన కమర్షియల్ కాంప్లెక్స్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. భీమిలి వద్ద రూ.2486.38 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు.

కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కె.రోజా, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్, మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, తూర్పు నావికాదళ అధికారి అడ్మిరల్ బిశ్వజిత్ దాస్ గుప్తా, చీఫ్ విప్ కరణం ధర్మశ్రీ, టిటిడి. ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, జిల్లా కలెక్టరు డాక్టర్ ఎ.మల్లికార్జున, జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, పార్లమెంటు సభ్యులు ఎంవివి.సత్యనారాయణ, బి.సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారిణి అంజలి శర్వాణికి రూ.10 లక్షల చెక్కు అందజేస్తున్న సిఎం

మెరుగైన వైద్యం అందించండి

గుండె సంబంధ వ్యాధితో బాధపడుతున్న వానపల్లి చరణ్ సాయి మణికంఠకు సిఎం తన పర్యటనలో భాగంగా భరోసా కల్పించారు. తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునను ఆదేశించారు. ఈ క్రమంలో చరణ్ సాయి మణికంఠకు లక్ష రూపాయల చెక్కును ఆరిలోవ వెళ్లి జిల్లా జాయింట్ కలెక్టర్ కెయస్.విశ్వనాథన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ రూరల్ తహశీల్దార్ సనపల రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.



వెంకటరెడ్డిని అరెస్టు చేస్తున్న పోలీసులు

అరెస్టుల పర్వం

500 మంది క్లాప్ డ్రైవర్లు, కాంట్రాక్టు వర్కర్లపై ప్రభుత్వ నిర్బంధం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వారం రోజులుగా జీవో 7 ప్రకారం రూ.18500 జీతం చెల్లించాలని డిమాండ్ చేస్తూ క్లాప్ డ్రైవర్లు, జివిఎంసి కాంట్రాక్టు వర్కర్లు సాగిస్తున్న ఆందోళన గురువారం తీవ్రరూపం దాల్చింది. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నగరానికి వచ్చిన సందర్భంగా ఆయనకు వినతి పత్రం ఇచ్చేందుకు జివిఎంసి గాంధీ విగ్రహం వద్దకు గురువారం మధ్యాహ్నం వచ్చిన క్లాప్ డ్రైవర్లను, జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్లను టూ టౌన్ పోలీసులు బలవంతంగా వాహనాలు ఎక్కించి అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి, క్లాప్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు పి.అనిల్ కుమార్, ఇందుకూరి లక్ష్మీ,రాజు, ఎం.గణేష్, పామాడ రాజు, చందక శ్రీను, ఇసాక్‌తో సహా వంద మంది ఉన్నారు. వీరందరినీ టూ టౌన్ స్టేషన్‌కు తరలించారు. అలాగే నగర పరిధిలోని గోపాలపట్నం, త్రీ టౌన్, గాజువాక, వన్‌టౌన్ తదితర ప్రాంతాలలో కూడా క్లాప్ డ్రైవర్లను, కాంట్రాక్ట్ వర్కర్లను అరెస్ట్ చేశారు. ఇలా అన్ని చోట్ల కలిపి 500 మందిని అరెస్ట్ చేసి వేర్వేరు పోలీసు స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి మాట్లాడుతూ జీవో 7ను అనుసరించి క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జాయింట్ లేబర్ కమిషనర్ కూడా ఈ మేరకు మార్గదర్శకాలు ఇచ్చారని గుర్తుచేశారు. అయినప్పటికీ జివిఎంసిలో అమలు చేయలేదన్నారు. కేవలం రూ.12,500 మాత్రమే కాంట్రాక్టర్ చెల్లిస్తున్నారని, ఇది అన్యాయమని అన్నారు. క్లాప్ డ్రైవర్లను ఆప్కాస్‌లో విలీనం చేయాలన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి వినతిపత్రం ఇచ్చేందుకు వెళుతున్న తమను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. అరెస్టులతో, బెదిరింపులతో ఉద్యమాన్ని ఆపలేరని, ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు

గంజాయి నిర్మూలనలో విఫలం

- టిడిపి మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : నాలుగేళ్ల పాలనలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం గంజాయి నిర్మూలనలో పూర్తిగా విఫలమైందని టిడిపి మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు విమర్శించారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల తర్వాత ఉత్తరాంధ్ర పోలీసు అధికారులు గంజాయి నివారణపై సమావేశం జరపడం గమనార్హమన్నారు. ఈ గంజాయి అంతా ఒడిశా నుంచి రవాణా జరుగుతోందని నెపం నెట్టేస్తున్నారని, అసలు ఈ గంజాయి ఎవరు పండిస్తున్నారో, అమ్ముతున్నారో అందరికీ తెలుసునని ఎద్దేవా చేశారు. యువత ఉద్యోగాలు లేక, పరిశ్రమలురాక విలవిల్లాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అల్లూరి జిల్లా ముంచింగిపుట్టు వద్ద 840 కిలోల గంజాయి పట్టుకున్నారని, నలుగురిని అదుపులోకి తీసుకోగా వారిని ఏమైనా విచారించారా ? అని ప్రశ్నించారు. కేంద్రంలో నార్కోటిక్ బ్యూరో రిపోర్టు గంజాయి రవాణాలో ఎపి నెంబర్ వన్‌గా ఉందని తేల్చిందన్నారు. దేశానికి ఆహార ధాన్యాలు అందించే స్థానం నుంచి గంజాయి అందించే దుస్థితికి రాష్ట్రం వచ్చిందని విమర్శించారు. విశాఖ, చోడవరం, గాజువాక ప్రాంతాలలో గంజాయి కేసుల విచారణకు మూడు ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం 2022 జులైలో జీవో ఇచ్చి, నేటికి ఒక్క కోర్టునూ ఏర్పాటు చేయలేదన్నారు. పాడేరు ఏజెన్సీ ప్రాంతంలోని 11 మండలాలలోని పోలీసు సిబ్బందిని తక్షణం బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. వారి సాయంతోనే గంజాయి అక్రమ రవాణా సాగుతోందని ఆరోపించారు. సమావేశంలో టిడిపి దక్షిణ ఇంచార్జ్ గండి బాబ్జీ, పార్టీ విశాఖ పార్లమెంట్ కార్యదర్శి పాశర్ల ప్రసాద్ పాల్గొన్నారు.



గిరిజన చట్టాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

గిరిజన చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆజాదీ కా అమృత మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా గురువారం గిరిజన సంక్షేమశాఖ, టిసిఆర్ అండ్ టిఎం ఆధ్వర్యంలో భూ బదలాయింపు, క్రమబద్ధీకరణ చట్టం, పీసా చట్టం, గ్రామసభ అధికారాలపై గిరిజన సంక్షేమ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. టిసిఆర్ అండ్ టిఎం కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గిరిజన సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ బి.మల్లికార్జున రెడ్డి అధ్యక్షత వహించారు. లీగల్ రిసోర్స్‌పర్సన్ డాక్టర్ పల్లా త్రినాథరావు అధికారులకు ఏజెన్సీ ప్రాంత చట్టాలు, గవర్నర్ విధులు, అధికారాలు, భూ బదలాయింపు క్రమబద్ధీకరణ చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సీతంపేట, పాడేరు, పార్వతీపురం, రంపచోడవరం, కెఆర్.పురం, చింతూరు ఐటిడిఎల అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారులు, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు, తహశీల్దార్లు, రెవెన్యూ అధికారులు, టిసిఆర్ అండ్ టిఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.చిన్నబాబు పాల్గొన్నారు.